పేషెంట్లు లేక - మెడికల్ జర్నల్ చదువుకుంటూ కాలక్షేపం చేస్తున్న డాక్టర్ కరుణాకర్.

"అంకుల్! డాక్టరంకుల్..." అన్న పిలుపు వినబడడంతో పుస్తకంలోంచి బయటపడి ద్వారంవేపు చూశాడు.

శ్వేత!

ప్రసాదరావ్‌గారి పాప.

ఐదారేళ్ల అమ్మాయి.


"రా బేబీ. కూర్చో..." అని స్టూలు చూపించి - "ఏం కావాలమ్మా?" అని అడిగాడు మృదువుగా.

"నాకు మందెయ్యాలంకుల్... మంచి మందు..." చెప్పింది శ్వేత.

"దేనికీమందు?"

"జ్వరం రావడాని కంకుల్..." - "మంచి మందు..."

కరుణాకర్‌కి నవ్వొచ్చింది పాప మాటకి. జ్వరం తగ్గిపోడాని కనబోయి పొరపాటున జ్వరం రావడానికందేమో



అనుకుని... నవ్వాపుకుని... ఆమె చేయందుకుని నాడి చూశాడు. బుగ్గలమీద చెయ్యి వేసి చూశాడు.

"నీకసలు జ్వరమే లేదమ్మా..." అన్నాడు.

"మీరు మందెయ్యకుండా ఎలా వొస్తుందీ జ్వరం?" చక్రాల్లాటి కళ్ళు తిప్పుతూ అడిగింది పాప.

అతనికేమీ అర్థంకాక - ఆశ్చర్యంగా చూశాడు. "ఏమిటీ శ్వేత నువ్వనేది?"

"నాకు జ్వరం కావాలి డాక్టరంకుల్. నిర్మల కొచ్చిందే... అలాటి జ్వరం... అచ్చంగా అలాటి జ్వరం..."

అతని ఆశ్చర్యం మరింత అధికమయింది.

నిర్మల జ్వరంలాటీ జ్వరం! ఎందుకని?

చివరకి జ్వరంలో కూడా సాటి పోటీయేనా? ఈ కాలపు పిల్లలనెంత పాడుచేసేస్తున్నారు పెద్దలు! ఆ పాపలా రాంక్ తెచ్చుకో... ఇంకో పాపలా ప్రయిజు తెచ్చుకో అంటూ తల్లితండ్రులు పోరుతూ పిల్లల బుర్రలు తినేస్తున్నారు. చివరకి జ్వరంలో కూడా క్లాస్‌మేట్ నిర్మలతో పోటీ పడుతున్నట్లుంది శ్వేత! సాటెమ్మ సరిపెట్టుకుంటే పోటెమ్మ ఉరిపెట్టుకుందనే సామెత చిన్నపిల్లలకి కూడా వర్తించే పిదపరోజులు వొచ్చి పడ్డాయన్నమాట! పైగా నిర్మలకి జ్వరం వొచ్చిందని తనకీ జ్వరం రావాలని కోరుకుంటున్నది శ్వేత! పాపం... పసిపాప.

"జ్వరం రావాలని కోరుకోకూడదమ్మా. రాకూడదనే కోరుకోవాలి" బుగ్గలు నిమురుతూ బుజ్జగింపుగా అన్నాడు కరుణాకర్.

"కాదంకుల్... నాకు జ్వరం కావాలి. జ్వరం రావాలి." ఏడుపు ముఖం పెట్టేసింది శ్వేత - డాక్టరంకుల్ అలా అనేసరికి.

"ఎందుకని పాపా?"

